సాక్షి మహబూబ్‌నగర్

గురువారం ׀ 5 ׀ డిసెంబర్ ׀ 2024



గణిత ల్యాబ్స్

శ్రీరామ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 10 పాఠశాలల్లో గణిత ల్యాబ్స్ ఏర్పాటయ్యాయి.

వివరాలు 8లో ▸



మరింత పెరిగిన ఉల్లి ధర

దేవరకద్ర మార్కెట్ యార్డులో బుధవారం ఉల్లిగడ్డ రూ.4,750లకు పెరిగింది.

వివరాలు 8లో ▸

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం 31.5 /20.2

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. చల్లని గాలులు వీస్తాయి. జల్లులు పడే అవకాశం ఉంది.

బదిలీల పందేరం


జీఓ 317 బాధిత ఉపాధ్యాయుల బదిలీలకు ప్రభుత్వం పచ్చజెండా



జీపీహెచ్ఎస్ పాఠశాలలో విద్యార్థులకు బోధిస్తున్న ఉపాధ్యాయురాలు (ఫైల్)

- కేవలం ఒక జిల్లా నుంచి మరో జిల్లాకు వెళ్లాలంటే మ్యూచువల్‌గా అవకాశం
- ఇటీవలి డీఎస్సీ అభ్యర్థులతో ఖాళీలన్నీ భర్తీ
- అవకాశం ఉన్న చోటికి భారీ డిమాండ్
- వాట్సాప్ గ్రూప్ ఏర్పాటు చేసి లోపాయికారి ఒప్పందాలు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: ప్రభుత్వం కొత్త జిల్లాలను ఏర్పాటు చేసిన తర్వాత విద్యాశాఖలో పనిచేస్తున్న ఉపాధ్యాయులను ఆయా జిల్లాలకు బదిలీ చేస్తూ 2022 డిసెంబర్‌లో జీఓ 317 తీసుకువచ్చింది. దీని ప్రకారం సీనియార్టీ ఆధారంగా వారిని బదిలీ చేశారు. దీంతో చాలామంది ఉపాధ్యాయులు స్పౌజ్ భార్య ఒకచోట పనిచేస్తున్నారని, భర్త మరోచోట చేస్తున్నారని, మరికొందరు స్థానికత కోల్పోయామని, అనారోగ్య సమస్యలు ఉన్నాయని, సీనియార్టీలో తప్పులు దొర్లిన కారణంగా వేరే చోటకు వెళ్లామని తదితర కారణాలతో ప్రభుత్వానికి వినతులు ఇచ్చారు. ఈ క్రమంలో ప్రభుత్వం సమస్య పరిష్కరించేందుకు మంత్రివర్గ ఉపసంఘాన్ని నియమించింది. గత ఆగస్టు నెలలో వివిధ జిల్లాల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు తమ సమస్యలపై డీఈఓ కార్యాలయంలో దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించారు. దీంతో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 1,937 మంది ఉపాధ్యాయులు దరఖాస్తు చేసుకున్నారు. తాజాగా దీనిని పరిశీలించిన ప్రభుత్వం అర్హులైన వారికి మ్యూచువల్ బదిలీ ఆధారంగా బదిలీ చేయాలని, ఈ ప్రక్రియను ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలని ఆదేశించింది.



ఒకే జిల్లాలో పనిచేసేలా..

ప్రధానంగా స్పౌజ్ బదిలీల్లో ప్రభుత్వం స్థానిక సంస్థలు, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల్లో వివిధ జిల్లాల్లో పనిచేస్తున్న భార్యాభర్తలు ఒకే జిల్లాలో పనిచేసేలా బదిలీలు జరగనున్నాయి. అంతేకాకుండా గతంలో ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా 13 జిల్లాల్లో స్పౌజ్ బదిలీలను నిషేధించి.. అందులో ఉమ్మడి పాలమూరులోని ఐదు జిల్లాల్లో ఇప్పుడు బదిలీలకు అవకాశం కల్పించింది. అయితే కేవలం మ్యూచువల్ బదిలీకి మాత్రమే అవకాశం ఉంది. ఇందులో ఒకే శాఖ, ఒకే కేడర్, ఒకే సబ్జెక్టు, ఒకే లాంగ్వేజ్ ఉన్న ఉపాధ్యాయులు ఒక జిల్లా నుంచి మరో జిల్లాకు మ్యూచువల్ బదిలీ కావడానికి ప్రభుత్వం ప్రత్యేక పోర్టల్‌ను అందుబాటులోకి తీసుకురానుంది. అందులో దరఖాస్తులు చేసుకుంటే అర్హత ఉన్నవారికి బదిలీ అవకాశం కల్పిస్తారు.

రూ.లక్షల్లో డిమాండ్.

ప్రభుత్వం కేవలం మ్యూచువల్ బదిలీకి అవకాశం కల్పించడంతో ఒక జిల్లా నుంచి మరో జిల్లాకు వెళ్లాలంటే బాగా డిమాండ్ ఏర్పడింది. అందుకోసం ఉమ్మడి జిల్లాలో పలువురు ఉపాధ్యాయులు 'మ్యూచువల్ ట్రాన్స్‌ఫర్' పేరుతో వాట్సాప్ గ్రూప్‌లు ఏర్పాటు చేసి బదిలీ కావాల్సిన వారిని అందులో చేర్చారు. అందులో ప్రతిరోజు వివిధ జిల్లాల నుంచి బదిలీ అయ్యేవారు జిల్లా పేరు, కేడర్ తదితర వివరాలను వెల్లడిస్తే దాని ఆధారంగా అవతలి వారు రూ.లక్షల్లో డిమాండ్ చేస్తున్నారు. ఉమ్మడి పాలమూరు పరిధిలో రూ.5- 10 లక్షల వరకు పలుకుతుండగా.. వికారాబాద్, రంగారెడ్డి తదితర జిల్లాలకు రూ.10-20 లక్షల వరకు పలుకుతోందని సమాచారం. దీంతో కొందరు డబ్బుల కోసమే బదిలీ అవుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఈ విషయంలో కట్టడి చేసేందుకు జిల్లా అధికారులు చర్యలు తీసుకోవాలని పలు సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

జిల్లాల వారీగా వచ్చిన దరఖాస్తులు ఇలా..

జిల్లా	దరఖాస్తులు
నారాయణపేట	756
నాగర్‌కర్నూల్	620
వనపర్తి	220
జోగుళాంబ గద్వాల	179
మహబూబ్‌నగర్	162
మొత్తం	1,937

ఖాళీలన్నీ భర్తీ..

ప్రస్తుతం ప్రభుత్వం బదిలీలకు అవకాశం కల్పించినా అనుకున్న స్థాయిలో బదిలీలు జరగవనే ప్రచారం వినిపిస్తుంది. ప్రభుత్వం ఇటీవల డీఎస్సీలో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 1,130 పోస్టులను భర్తీ చేసింది. ఇప్పుడు బదిలీ జరగాలంటే ఉపాధ్యాయులకు ఖాళీలు ఉంటే అది సాధ్యపడుతుందని, ఖాళీలు లేకపోతే బదిలీలకు అవకాశం లేదని ఉపాధ్యాయ సంఘాలు పేర్కొంటున్నారు. ఈ ప్రక్రియను డీఎస్సీ కంటే ముందే చేసి ఉంటే బాగుండేదని తెలుస్తుంది. అంతేకాకుండా ఒక జిల్లా నుంచి మరో జిల్లాకు బదిలీ అయ్యే ఉపాధ్యాయులకు సర్వీస్ జీరో కానుంది. అంటే గత 15 ఏళ్లుగా విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయుడు జిల్లా దాటి బదిలీ అయితే ఆయన సర్వీస్ మొత్తం మొదటికి వస్తుంది. 2024లో ఉద్యోగం పొందిన వారి కంటే కూడా వీరు జూనియర్లు కానున్నారు.

"

రిటైర్డ్ పోస్టుల్లో భర్తీ చేయాలి



బదిలీలకు ప్రభుత్వం అవకాశం కల్పించిన నేపథ్యంలో ఎక్కువ పోస్టులు ఖాళీగా లేవు. దీన్ని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం స్కూల్ అసిస్టెంట్లను జోనల్ పోస్టులుగా పరిగణించాలి. త్వరలో రిటైర్డ్ కాబోతున్న ఉపాధ్యాయుల స్థానంలో ఇప్పుడు బదిలీ అయ్యే వారికి అవకాశం ఇవ్వాలి. అలాగే బైపోస్టులను కూడా క్రియేట్ చేసి బదిలీలకు అవకాశం కల్పించాలి. అందరికీ న్యాయం చేసేందుకు కృషి చేయాలి.

– మదన్‌మోహన్‌యాదవ్, పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు

ప్రభుత్వమే బాధ్యత తీసుకోవాలి..



బదిలీల ప్రక్రియను ప్రభుత్వమే బాధ్యతగా తీసుకొని ప్రక్రియను నిర్వహించాలి. గతంలో మ్యూచువల్ బదిలీకి రూ.10 లక్షల నుంచి 20 లక్షల వరకు ఖర్చు పెట్టుకున్న వారు ఉన్నారు. ఇది పరోక్షంగా అవినీతికి తావిస్తోంది. ప్రస్తుత జీఓల వల్ల ఎలాంటి ప్రయోజనం లేదు. గత ప్రభుత్వం చేసిన తప్పులనే ఈ ప్రభుత్వం చేస్తోంది.

– వెంకటేష్, యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు

దరఖాస్తు చేసుకున్న వారికి బదిలీ ఇవ్వాలి



ప్రభుత్వం బదిలీలకు అవకాశం కల్పించడం హర్షించదగ్గ విషయం. 317 జీఓతో ప్రభావితమై వివిధ కేటగిరిల కింద దరఖాస్తులు చేసుకున్న వారికి తప్పకుండా బదిలీ ఇవ్వాలి. ప్రధానంగా స్థానికత కోల్పోయిన వారికి ఖాళీలు లేకపోతే సూపర్ న్యూమరరీ, బై పోస్టుల్లో బదిలీకి అవకాశం కల్పించాలి. స్కూల్ అసిస్టెంట్‌లను లోకల్ కేడర్‌గా పరిగణిస్తే సమస్య పూర్తిగా పరిష్కారం అవుతుంది.

– శ్యాంబాబు, టీపీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు

పరస్పర బదిలీలకు ఆదేశాలు వచ్చాయి



ఉపాధ్యాయుల పరస్పర బదిలీలకు ఆదేశాలు వచ్చాయి. ఇందులో కొత్తగా దరఖాస్తు చేసుకునే వారికి ఈ నెల 31 వరకు అవకాశం ఉంది. గతంలో దరఖాస్తు చేసుకున్న వారి ప్రక్రియ యథావిధిగా కొనసాగుతుంది. మెడికల్, స్పౌజ్‌లకు సంబంధించి త్వరలో ఆదేశాలు వచ్చే అవకాశం ఉంది.. ఆ ప్రకారం ప్రక్రియ పూర్తి చేసేందుకు సిద్ధంగా ఉన్నాం.

– ప్రవీణ్‌కుమార్, డీఈఓ

న్యూస్‌రీల్

'కార్పొరేట్, ప్రైవేట్ విద్యను కట్టడి చేయాలి'

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: రాష్ట్రంలో కార్పొరేట్, ప్రైవేట్ విద్యా రంగాన్ని కట్టడి చేయాలని పాలమూరు అధ్యయన వేదిక కన్వీనర్ ఎం.రాఘవాచారి బుధవారం ఒక ప్రకటనలో కోరారు. ప్రజలకు ఉచిత హక్కుగా దక్కాల్సిన విద్యను పాలకులు ఏ మాత్రం పట్టించుకోకుండా ప్రైవేట్, వ్యాపార రంగానికి అప్పగించడం తగదని పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమంలో ఈ అంశంపై చర్చ జరిగిందని, ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన నాయకులు ప్రభుత్వ ఉచిత విద్యపై దృష్టి పెట్టలేదని ఆరోపించారు. దీంతో కొన్ని కార్పొరేట్ పాఠశాల/కళాశాల యాజమాన్యాలు జిల్లాలకు తమ బ్రాంచిలను విస్తరించి, విద్యార్థుల నుంచి ఎక్కువ ఫీజు వసూలు చేస్తున్నాయని తెలిపారు. పేద, మధ్యతరగతి వర్గాలు తమ పిల్లలను చదివించడానికి అప్పులు చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. ఇప్పటికైనా ప్రైవేట్ విద్యాసంస్థల నియంత్రణకు ప్రత్యేక చట్టం తీసుకుని రావాలని ఆయన డిమాండ్ చేశారు.

ఘనంగా మహబూబ్‌నగర్ అవతరణ దినోత్సవం



స్టేషన్ మహబూబ్‌నగర్: ఆరో నిజాం నవాబ్ మీర్ మహబూబ్‌అలీ ఖాన్ బహద్దూర్ ఫౌండేషన్ అధ్యక్షుడు ఎంఏ రహీమ్ ఆధ్వర్యంలో మహబూబ్‌నగర్ 134వ అవతరణ దినోత్సవ వేడుకలను బుధవారం జిల్లాకేంద్రంలోని ఫౌండేషన్ కార్యాలయంలో నిర్వహించారు. ముందుగా కేక్‌కట్ చేశారు. అనంతరం జరిగిన వేడుకల్లో పలువురు వక్తలు మాట్లాడుతూ నైజాం ప్రాంతం చారిత్రాత్మకంగా, సాంస్కృతికంగా ఎంతో అభివృద్ధి చెందిందన్నారు. మహబూబ్‌నగర్‌లో గంగాజమున తహజీబ్‌లా హిందూ–ముస్లింలు కలిసిమెలిసి ఉంటారని అన్నారు. ఒకరి పండుగల్లో మరొకరు పాలుపంచుకొని అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారని అన్నారు. అనంతరం అతిథులను ఫౌండేషన్ అధ్యక్షుడు ఎం.ఎ.రహీం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకుడు ఎన్‌పీ.వెంకటేశ్, ఆల్‌మేవా రాష్ట్ర అధ్యక్షుడు షేక్ ఫారుఖ్ హుస్సేన్, మున్సిపల్ వైస్ చైర్మన్ షబ్బీర్ అహ్మద్, ప్రతినిధులు హనీఫ్ అహ్మద్, అబ్దుల్ హాదీ, ఎస్.ఎం.ఖలీల్, మోసీన్‌ఖాన్, సమద్‌ఖాన్, బాబర్‌షేక్, రఫీక్ పటేల్, రహెమాన్‌రీగల్, సాదతుల్లా హుస్సేని, పీర్ సాధిక్, ఇలియాజ్ ముజాహిద్ పాల్గొన్నారు.

'ప్రజలకిచ్చిన హామీలు నెరవేర్చాలి'

పాలమూరు: ప్రజలకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలని బీజేపీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ సభ్యులు నాగురావు నామాజీ డిమాండ్ చేశారు. జిల్లాకేంద్రంలో బుధవారం బీజేపీ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి ఆరు గ్యారంటీలు, 66 అబద్ధాలు చెప్పారని ఆరోపించారు. దీనిపై బీజేపీ చార్జిషీట్ వేసిందని, దీనికి సీఎం రేవంత్ సమాధానం చెప్పాలన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీల్లో ఒక్కటి కూడా పూర్తిగా అమలు చేయలేదన్నారు. మహిళలకు నెలకు రూ.2,500లు ఎప్పుడు ఇస్తారో చెప్పాలని, నిరుద్యోగ భృతి, జాబ్ క్యాలెండర్ ఎక్కడి పోయిందని ప్రశ్నించారు. పెన్షన్‌లను రూ.2 వేల నుంచి రూ.4 వేలకు పెంచి ఇస్తానని మోసం చేశారని ఆరోపించారు. రైతుబంధు రూ.15 వేలు ఇస్తానని ఏడాది గడుస్తున్నా దాని ఊసే లేదన్నారు. బీజేపీ ప్రజలకు అండగా నిలబడుతుందని, హామీలు అమలు చేసే వరకు పోరాడుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు కె.రాములు, నాగేశ్వర్‌రెడ్డి, కృష్ణవర్ధన్‌రెడ్డి, పాండురంగారెడ్డి, మెట్టుకాడి శ్రీనివాసులు, నర్సంగౌడ్, రమేష్‌కుమార్, కిరణ్‌కుమార్ రెడ్డి, బుచ్చిరెడ్డి, అంజయ్య, రామాంజనేయులు, సతీష్‌కుమార్, సుబ్రమణ్యం, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

వన్యప్రాణుల సంరక్షణపై అవగాహన కల్పించాలి




స్నేక్‌షోలో కొండచిలువను పట్టుకొని పరిశీలిస్తున్న కలెక్టర్ విజయేందిర

- కలెక్టర్ విజయేందిర

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): పర్యావరణ పరిరక్షణ, వన్యప్రాణుల సంరక్షణపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని కలెక్టర్ విజయేందిర బోయి పేర్కొన్నారు. ప్రజా విజయోత్సవాలలో భాగంగా బుధవారం అటవీశాఖ ఆధ్వర్యంలో మయూరి ఎకో పార్క్‌లో వనదర్శిని కార్యక్రమం, స్నేక్ షో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ, వన్యప్రాణుల సంరక్షణ విషయాలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండడం అభినందించారు. జిల్లాలో పర్యాటక ప్రదేశాలు సందర్శించి విజ్ఞానం పెంపొందించుకోవాలని, జిల్లాలో పాఠశాలల్లో యువ టూరిజం క్లబ్‌లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అనంతరం జడ్చర్ల బీఆర్ఆర్ డిగ్రీ, పీజీ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ డా.సదాశివయ్య స్నేక్‌షో నిర్వహించారు. ఆసక్తిగా తిలకించిన విద్యార్థులు పాముల్లోని రకాలు, విషరహిత సర్పాలు, కాటు వేస్తే లక్షణాలు, పాములతో పర్యావరణ సమతుల్యత... తదితర విషయాలపై తెలుసుకున్నారు. ఎనుగొండ, అప్పనపల్లి, బోయపల్లి, రెడ్‌క్రాస్ సన్నిధి విద్యార్థులు వనదర్శినికి హాజరయ్యారు. అనంతరం వ్యాసరచన, ఉపన్యాస, డ్రాయింగ్ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రంలో డీఎఫ్ఓ సత్యనారాయణ, డీపీఆర్ఓ శ్రీనివాస్, ఫ్లయింగ్ స్క్వాడ్ అటవీ అధికారి రాంమోహన్, రెడ్‌క్రాస్ చైర్మన్ నటరాజ్, తదితరులు పాల్గొన్నారు.

భూ ప్రకంపనల కలకలం



జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్)/జడ్చర్ల టౌన్: జిల్లాలో బుధవారం ఉదయం ఏర్పడిన భూ ప్రకంపనలతో కలకలం రేగింది. జిల్లా కేంద్రంతో పాటు జడ్చర్ల పట్టణంలో ఉదయం 7.30 గంటల నుంచి 7.32 గంటల మధ్య స్వల్పంగా భూమి కంపించింది. మిగతా ప్రాంతాల్లో ఎక్కడా దీని ప్రభావం లేదు. జడ్చర్ల ఏరియా ఆస్పత్రిలోని మంచాలు, కుర్చీలు, గ్లాస్ డోర్లు, ఇతర వస్తువులు అటు, ఇటు ఊగినట్లు కావడంతో రోగులు ఏం జరుగుతుందేమోనని ఆందోళన పడ్డారు. దాదాపు 10 నుంచి 15 సెకండ్ల పాటు తమ మంచాన్ని ఎవరో అటు ఇటు ఊపినట్లు అనిపించిందని కొందరు దయాల సిస్‌కేంద్రం లోని రోగులు తెలిపారు. జిల్లా పరిషత్ కార్యాలయం ఆవరణలో ఉన్న క్వార్టర్స్‌లో భూమి కంపించినట్లు జెడ్పీ సీఈఓ వెంకట్‌రెడ్డి సైతం తెలిపారు. బీరువా, గ్రిల్స్ కదిలినట్లు అనిపించాయని చెప్పారు. ఇది 5 నుంచి 6 సెకండ్ల జరిగినట్లు వివరించారు. రాష్ట్రంలో పలు ప్రాంతాల్లో భూకంపం వచ్చినట్లు టీవీలో వార్తలు చూశాక.. ఇక్కడకూడా భూమి కంపించి ఉంటుందని అనుకున్నట్లు వివరించారు.

పత్తి క్వింటాల్ రూ.6,859

జడ్చర్ల/దేవరకద్ర: బాదేపల్లి మార్కెట్‌లో బుధవారం పత్తి క్వింటాల్ గరిష్ఠంగా రూ.6,859, కనిష్ఠంగా రూ.6,000 పలికింది. ధాన్యం ఆర్ఎన్ఆర్ క్వింటాల్ గరిష్ఠంగా రూ.2759, కనిష్ఠంగా రూ.1717, హంస గరిష్ఠంగా రూ.2,275, కనిష్ఠంగా రూ.2,069, మొక్కజొన్న గరిష్ఠంగా రూ.2,431, కనిష్ఠంగా రూ.2,289, వేరుశనగ గరిష్ఠంగా రూ.6,140, కనిష్ఠంగా రూ.5,065 ధరలు లభించాయి. దేవరకద్ర మార్కెట్ యార్డులో శ్రీరామ్ గోల్డ్ ధర క్వింటాల్‌కు రూ.2,736గా ఒకే ధర నమోదు పలికింది. ఆర్ఎన్ఆర్ ధాన్యం గరిష్ఠంగా రూ.2,656, కనిష్ఠంగా రూ.2,169గా ధరలు లభించాయి. ఆముదాల ధర క్వింటాల్‌కు రూ.5,709గా ఒకే ధర వచ్చింది.

'యూత్ కాంగ్రెస్' ఫలితాలు విడుదల



యూత్ కాంగ్రెస్ అధ్యక్షులను సన్మానించిన ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

- జిల్లా అధ్యక్షుడిగా మహ్మద్ అవేజ్ అహ్మద్
- అసెంబ్లీ, పట్టణ, మండల అధ్యక్షుల ఎన్నికలు సైతం పూర్తి
- ఆన్‌లైన్ వేదికగా నిర్వహణ.. రెండు నెలల తర్వాత ఫలితాల వెల్లడి

స్టేషన్ మహబూబ్‌నగర్: యువజన కాంగ్రెస్‌లో ఎన్నికల ఫలితాలు బుధవారం విడుదల అయ్యాయి. గతంలో మాదిరిగా ఈసారి ఆన్‌లైన్ వేదికగా ఎన్నికలు నిర్వహించారు. మండల, పట్టణ, అసెంబ్లీ నియోజకవర్గ, జిల్లా, రాష్ట్రస్థాయిలో యువజన కాంగ్రెస్‌కు సంబంధించిన వెబ్‌సైట్, యాప్‌లో జూలై నెలలో ఎన్నికల షెడ్యూల్ విడుదల చేశారు. అదే నెల 11 నుంచి 22 వరకు నామినేషన్లు స్వీకరించారు. అనంతరం అభ్యంతరాల స్వీకరణ, సభ్యత్వ నమోదు చేసి, ఆన్‌లైన్ వేదికగా ఎన్నికల ప్రక్రియ చేపట్టారు. దాదాపు రెండు నెలల తర్వాత ఫలితాలు వెల్లడించారు. ఇందులో ప్రధానంగా మహబూబ్‌నగర్ జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్ష పదవికి 24,772 ఓట్లు పడగా, వీటిలో 232 ఓట్లను చెల్లకుండా పోయాయి. ప్రస్తుత ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడిగా ఉన్న మహ్మద్ అవేజ్ అహ్మద్ 9,621 ఓట్లు సాధించి జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. మిగతా ఐదుగురు అభ్యర్థులు వారు సాధించిన ఓట్ల మేరకు ఇతర ఉపాధ్యక్షులుగా ఎంపికయ్యారు. జిల్లా ఉపాధ్యక్షుడిగా (ఓపెన్) మహేష్ కుమార్ పుట్టాల-6,083 ఓట్లు, ఉపాధ్యక్షుడిగా (ఓబీసీ) ఎస్.శ్రీనివాసులు -5,077 ఓట్లు, జిల్లా కార్యదర్శిగా (ఈసీ) ఎం.రమేశ్-2,881 ఓట్లు, మహిళా జిల్లా ఉపాధ్యక్షురాలిగా జ్యోతి-510 ఓట్లు, ఉపాధ్యక్షుడిగా (ఎస్టీ) నేనావత్ మోహన్-368 ఓట్లు సాధించారు. జిల్లా యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శులుగా ఓపెన్‌లో ఎం.సంజీవరెడ్డి, మహ్మద్ సలావుద్దీన్, బి.సురేష్, మహ్మద్ ఇమ్రాన్, మహ్మద్ ఇంతియాజుద్దీన్, శివ మల్లేష్‌బాబు, ఎస్.లక్ష్మీకాంత్‌రెడ్డి, మైనార్టీలో జిల్లా ప్రధాన కార్యదర్శిగా ముజీతబా అహ్మద్ ఫైజాన్, మహిళలో సబా మహ్మద్, ఓబీసీలో శివకుమార్, ఎస్టీలో లక్ష్మణ్ సబావత్, అసెంబ్లీ ప్రధాన కార్యదర్శులుగా మల్లికార్జున్ యాదవ్, సతీష్ ముదిరాజ్, కె.సురేందర్‌రెడ్డి, బి.శివకుమార్ జోగి, ప్రవీణ్‌కుమార్, పి.మహేష్, వంశీ, పి.నవీన్‌యాదవ్, పవన్‌కల్యాణ్ ఎన్నికయ్యారు.

- మహబూబ్‌నగర్ అసెంబ్లీ నియోజకవర్గ అధ్యక్షుడిగా ఎండీ సల్మాన్ (1,941 ఓట్లు), జడ్చర్ల అధ్యక్షుడిగా ఎం.శ్రీకాంత్‌రెడ్డి (4,070 ఓట్లు), దేవరకద్ర అధ్యక్షుడిగా ఎస్.లక్ష్మీకాంత్‌రెడ్డి (1,281 ఓట్లు) ఎన్నికయ్యారు. అసెంబ్లీకి సంబంధించి ఇతర అభ్యర్థులు వారి ఓట్ల ప్రకారం ఉపాధ్యక్షుడిగా, అసెంబ్లీ కార్యదర్శులుగా ఎన్నికయ్యారు.
- మండలాలకు సంబంధించి.. మహబూబ్‌నగర్ అర్బన్ అధ్యక్షుడిగా రహీం, రూరల్ అధ్యక్షుడిగా ప్రసాద్, హన్వాడ అధ్యక్షుడిగా శ్రీశైలం యాదవ్, అడ్డాకుల అధ్యక్షుడిగా మహ్మద్ నసీర్, భూత్పూర్ అధ్యక్షుడిగా భూపతిరెడ్డి, సీసీకుంట అధ్యక్షుడిగా రంజిత్ కుమార్‌రెడ్డి, దేవరకద్ర అధ్యక్షుడిగా బి.బన్ని, కొత్తకోట అధ్యక్షుడిగా జయప్రకాశ్, మదనాపురం అధ్యక్షుడిగా శ్రీనివాస్, మూసాపేట అధ్యక్షుడిగా రవికుమార్, బాలానగర్ అధ్యక్షుడిగా ఎస్.శ్రీనాథ్, జడ్చర్ల అధ్యక్షుడిగా షకీల్, మిడ్జిల్ అధ్యక్షుడిగా క్రిష్ణయాదవ్, నవాబ్‌పేట అధ్యక్షుడిగా నీలకంఠం, రాజాపూర్ అధ్యక్షుడిగా సబావత్ గణేష్, ఉర్కొండ మండల అధ్యక్షుడిగా గుంజ ఆది ఎన్నికయ్యారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. నూతనంగా ఎంపికైన జిల్లా, అసెంబ్లీ, మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షులు, కార్యదర్శులు బుధవారం ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఎమ్మెల్యే వారిని శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

పీయూలో ఘనంగా జాతీయ వ్యవస్థాపక దినోత్సవం



స్టాల్స్‌ను రిబ్బన్‌కట్ చేసి ప్రారంభిస్తున్న వీసీ జీఎన్ శ్రీనివాస్

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పాలమూరు యూనివర్సిటీలో బుధవారం ఘనంగా జాతీయ వ్యవస్థాపక దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంబీఏ విద్యార్థులు ఏర్పాటు చేసిన స్టాల్స్ ఎగ్జిబిషన్‌ను వీసీ జీఎన్ శ్రీనివాస్ రిబ్బన్‌కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ విద్యార్థులు కళాశాల స్థాయిలో ఇలాంటి కార్యక్రమాల్లో పాల్గొనడం వల్ల బిజినెస్ అంశాలపై పూర్తిస్థాయిలో అవగాహన వస్తుందన్నారు. విద్యార్థుల్లో సృజనాత్మకత, ఊహాశక్తిని పెంపొందించేలా, వారిలో ఆత్మవిశ్వాసాన్ని పెంచేలా ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. వీటి వల్ల భవిష్యత్‌లో రాణించేందుకు అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో సంగీత కళాశాల వ్యవస్థాపక అధ్యక్షులు కె.రాములు, ప్రధాన కార్యదర్శి హరిప్రసాద్, కె.లక్ష్మణ్, ఎం.కృష్ణయ్య, అంజయ్య, శివరాజ్, సత్యం, శ్రీనివాస్, రమాకళ, గోపాల్, వెంకటేశ్, భరత్, శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

సంగీత లోకానికి ఘంటసాల సేవలు మరువలేనివి



స్టేషన్ మహబూబ్‌నగర్: తెలుగు సంగీత లోకానికి ఘంటసాల వెంకటేశ్వర్‌రావు అందించిన సేవలు మరువలేనివని పలువురు వక్తలు అన్నారు. ఘంటసాల సంగీత కళాశాల ఆధ్వర్యంలో శనివారం జిల్లాకేంద్రంలో ఘంటసాల జయంతి ఉత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఘంటసాల తన పాటలతో ప్రపంచంలోని కోట్లాది జనుల ప్రశంసలు పొందారని అన్నారు. తెలుగుపాటకు వరం ఘంటసాల స్వరం అని అన్నారు. ఘంటసాల స్వరం భౌతికంగా లేకున్నా ఆయన కంఠం నుంచి జాలువారిన సుమధుర గీతాలు నేటికి చెక్కుచెదరకుండా ఉన్నాయని అన్నారు. కార్యక్రమంలో సంగీత కళాశాల వ్యవస్థాపక అధ్యక్షులు కె.రాములు, ప్రధాన కార్యదర్శి హరిప్రసాద్, కె.లక్ష్మణ్, ఎం.కష్టయ్య, అంజయ్య, శివరాజ్, సత్యం, శ్రీనివాస్, రమాకళ, గోపాల్, వెంకటేశ్, భరత్, శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు చెల్లించండి

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): ఆశావర్కర్లు నిర్వహించిన పోలియో, లెప్రసీ సర్వేకు సంబంధించిన బిల్లులను వెంటనే చెల్లించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దీప్లా నాయక్, కురుమూర్తి డిమాండ్ చేశారు. బుధవారం కలెక్టరేట్ ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో ఆశావర్కర్లు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతేడాది నిర్వహించిన సర్వే డబ్బులు ఇప్పటి వరకు ఇవ్వని ప్రభుత్వం.. మళ్లీ లెప్రసీ సర్వే చేయాలని ఆశలపై ఒత్తిడి చేస్తున్నారని అన్నారు. ఈ సంవత్సరం నిర్వహించిన పల్స్‌పోలియో బిల్లులు కూడా ఇంకా అందలేదని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న బిల్లులు చెల్లించిన తర్వాతే కొత్త సర్వేలు చేస్తారని స్పష్టం చేశారు. అదే విధంగా ఆశా వర్కర్లకు ఫిక్స్‌డ్ వేతనం రూ. 18వేలు ఇవ్వాలని, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, పై అధికారుల వేధింపులు ఆపాలని డిమాండ్ చేశారు. ఆశావర్కర్ల సమస్యలపై ప్రభుత్వం స్పందించకుంటే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో రాజ్‌కుమార్, యాదమ్మ, పద్మ, సావిత్రి, హైమావతి, రాజేశ్వరి, నర్సమ్మ, శివలీల, చంద్రకళ పాల్గొన్నారు



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టిన ఆశావర్కర్లు

క్లుప్తంగా

జీసీసీ ఉద్యోగి హఠాన్మరణం



కిషన్‌నాయక్ (ఫైల్)

మన్ననూర్: గిరిజన కో–ఆపరేటివ్ సంస్థ (జీసీసీ)లో ఎంసీ డబ్ల్యూగా విధులు నిర్వర్తిస్తున్న వి.కిషన్‌నాయక్ (60) బుధవారం కార్యాలయ ఆవరణలో అకస్మాత్తుగా మృతిచెందారు. ఈయన కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతుండగా అప్పుడప్పుడు భార్య సాయంతో విధులకు హాజరయ్యేవారు. బుధవారం కూడా భార్యతో కలిసి కార్యాలయానికి వచ్చి మధ్యాహ్న సమయంలో ఇంటి నుంచి తెచ్చుకున్న భోజనం చేస్తుండగా తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. జీసీసీ డీఎం సంతోష్‌కుమార్ సూచన మేరకు సమీపంలోని ఆర్డీటీ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. అనంతరం మృతదేహాన్ని స్వగ్రామం మహబూబ్‌నగర్‌కు జీసీసీ వాహనంలో తరలించారు. కిషన్‌నాయక్‌కు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

గొంతు కోసుకుని మహిళ ఆత్మహత్య

మహమ్మదాబాద్: కుటుంబ కలహాలతో విసుగెత్తిన ఓమహిళ ఇంట్లో ఉన్న కత్తిపీటతో గొంతుకోసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘట మహమ్మదాబాద్ మండల కేంద్రంలో చోటు చేసుకున్నది. పోలీసులు తెల్పిన వివరాల ప్రకారం.. మహమ్మదాబాద్ మండల కేంద్రానికి చెందిన చెన్నెల్లి పుష్పలత (32) భర్తతో కలిసి వ్యవసాయం చేస్తుండేవారు. ఈ తరుణంలో కుటుంబ కలహాల వల్ల కల్లుతాగుడుకు బానిసయ్యింది. మనస్తాపానికి గురై మంగళవారం రాత్రి కల్లుమత్తులో కత్తిపీటతో గొంతుకోసుకుని అక్కడే పడిఉన్నది. గమనించిన కుటుంబీకులు వెంటనే ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఆమె తల్లి బొంత సాయమ్మ ఫిర్యాదు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు మహమ్మదాబాద్ ఎస్ఐ శేఖర్‌రెడ్డి తెలిపారు.

పురుగుమందు తాగి వ్యక్తి..

మహమ్మదాబాద్: అనారోగ్యంతో బాధపడుతూ ఆ బాధ భరించలేక పురుగు మందు తాగి ఓవ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మండలంలోని నంచర్లలో బుధవారం ఈఘటన చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. నంచర్ల గ్రామానికి చెందిన బంటు హనుమంతు (34) కొన్నేళ్లుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఇటీవలే తల్లి మృతిచెందగా హనుమంతు తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. ఇదే తరుణంలో మంగళవారం పొలానికి వెళ్లి పురుగు మందు తాగాడు. పొలంలో స్పృహతప్పి పడిపోయాడు. గమనించిన కుటుంబసభ్యులు వెంటనే ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడి అన్న మారుతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శేఖర్‌రెడ్డి తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో మహిళ..

బీబీనగర్: యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్ మండలం చిన్నరావులపల్లి గ్రామ పరిధిలోని ఓ గొర్రెల ఫాంలో మహిళ అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. ఈ ఘటన బుధవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. స్థానిక సీఐ ప్రభాకర్ తెలిపిన వివరాల ప్రకారం.. నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ మండల పరిధిలోని మాచినేనిపల్లి గ్రామానికి చెందిన మరియమ్మ(40) తన భర్తతో కలిసి బీబీనగర్ మండలం చిన్నరావులపల్లి గ్రామ శివారులోని ఓ గొర్రెల ఫాంలో కొంతకాలంగా పనిచేస్తూ అందులోనే నివాసం ఉంటున్నారు. కొద్దిరోజులుగా మరియమ్మ గొర్రెల ఫాంలో కనిపించక పోవడంతో ఫాం నిర్వాహకుడు విష్ణువర్ధన్‌రావు ఐదు రోజుల క్రితం ఆమె భర్తను అడిగాడు. అతడు కూడా మరియమ్మ కనిపించడం లేదని చెప్పడంతో స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి మరియమ్మ కోసం గాలింపు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో బుధవారం గొర్రెల ఫాంలో వెతకగా మరియమ్మ మృతదేహం అక్కడే తుంగలో కనిపించింది. మరియమ్మ భర్తతో గొడవపడి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుని ఉండవచ్చని పోలీసులు భావిస్తుండగా.. మరియమ్మను భర్తే తుంగలో వేసి హత్య చేసినట్లు స్థానికులు అనుమానిస్తున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

సోములోనికుంటలో మృతదేహం లభ్యం



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

రాజాపూర్(బాలానగర్): బాలానగర్ మండలంలోని ఉడిత్యాల గ్రామ శివారులోగల సోములోనికుంటలో బుధవారం 55 సంవత్సరాలు వయస్సు గల గుర్తు తెలియని శవం లభ్యమైనట్లు బాలానగర్ ఎస్ఐ తిరుపాజి తెలిపారు. మృతుడి ఒంటిపై తెల్ల టీషర్ట్, గోధుమ కలర్ ప్యాంటు, నడుముకు ఎర్రటి మొలతాడు ఉన్నాయని అన్నారు. మృతదేహం జడ్చర్ల ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీలో ఉందన్నారు. మృతుడి సంబంధీకులు ఎవరైనా ఉంటే బాలానగర్ ఎస్ఐ సెల్ నెంబర్ 8712659346కు సంప్రదించాలని ఆయన తెలిపారు.

గణిత ల్యాబ్స్

శ్రీరామ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 10 ఉన్నత పాఠశాలల్లో ఏర్పాటు



పరికరాలతో బోధనపై శిక్షణ పొందుతున్న ఉపాధ్యాయులు

- విద్యార్థుల్లో గణితంపై ఆసక్తి పెంపొందించే యత్నం
- ముగిసిన ఉపాధ్యాయుల శిక్షణ

జడ్చర్ల టౌన్: ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు గణితంపై ఆసక్తి పెంపొందించేందుకు పోలేపల్లి ఫార్మసెజ్‌లోని ధర్మకేబుల్ సంస్థకు చెందిన శ్రీరామ చారిటబుల్ ట్రస్ట్ జడ్చర్ల మండలంలో 8, రాజాపూర్ మండలంలో 2 జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో గణిత ల్యాబ్‌ల ఏర్పాటుకు ముందుకొచ్చింది. ఎంపిక చేసిన ఒక్కో పాఠశాలలో ల్యాబ్ ఏర్పాటుకుగాను మొదటి విడతగా రూ.50 వేల విలువైన పరికరాలు అందించింది. వాటిని ఎలా వినియోగించాలో ఆయా పాఠశాలల గణిత ఉపాధ్యాయులకు నిపుణులతో రెండ్రోజుల శిక్షణ ఇవ్వగా బుధవారం ముగిసింది. ఎంపికైన పాఠశాలల్లో జడ్చర్ల మండలంలోని జడ్చర్ల, కోడ్గల్, పెద్ద ఆదిరాల, నసురుల్లాబాద్, గొల్లపల్లి, బాదేపల్లి బాలికల, బాదేపల్లి ఉర్దూ మీడియం ఉన్నత పాఠశాల, రాజాపూర్ మండలంలోని రాజాపూర్, తిర్మలాపూర్ జెడ్పీ ఉన్నత పాఠశాలలు ఉన్నాయి.

6, 7, 8 తరగతుల విద్యార్థులకు..

ఎంపికైన పాఠశాలల్లోని 6, 7, 8 తరగతుల విద్యార్థులకు ప్రయోజనం కలిగేలా ఈ ఏడాదే ల్యాబ్‌లు ఏర్పాటు చేసి పరికరాలు అందజేసింది.

ఉపాధ్యాయులకు శిక్షణ..

జడ్చర్ల జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఎంపిక చేసిన 10 పాఠశాలల్లోని 22 ఉపాధ్యాయులకు మంగళ, బుధవారం శిక్షణ ఇచ్చారు. గణిత ల్యాబ్‌లోని పరికరాలను ఎలా వినియోగించాలి.. వాటి ఉపయోగాలను సుఆర్ట్ ప్రతినిధులు అవగాహన కల్పించారు.

విద్యార్థులు స్వయంగా వాటిని వినియోగించడంతో వారిలో గణితంపై ఆసక్తి పెరగడంతో పాటు గుర్తుండిపోతాయి. ఈ ఏడాది ఆయా పాఠశాలల్లో వచ్చిన ఫలితాల ఆధారంగా వచ్చే విద్యా సంవత్సరం నుంచి అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ల్యాబ్‌లు ఏర్పాటు చేయనున్నారు. వచ్చే ఏడాది ప్రస్తుత పాఠశాల్లోని 9, 10 తరగతులకు సైతం ల్యాబ్ పరికరాలు ఇవ్వడంతో పాటు మరిన్ని ప్రభుత్వ పాఠశాలల్లో 6, 7, 8 తరగతుల విద్యార్థులకు ల్యాబ్‌లు ఏర్పాటు చేయనున్నారు.



ల్యాబ్ పరికరాలు

గణితంపై ఆసక్తి పెంపొందించేలా..



సాధారణంగా చాలామంది విద్యార్థులకు గణితం అంటేనే భయపడతారు. అయితే శ్రీరామ చారిటబుల్ ట్రస్ట్ అందజేస్తున్న పరికరాలతో బోధించడంతో ప్రతి విద్యార్థికి ఆసక్తి కలుగుతుంది. రెండ్రోజుల శిక్షణతో మాలో బోధనాసక్తి పెరిగింది. ఈ పరికరాలు ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు వరం అనే చెప్పాలి.

– కె.విష్ణువర్ధన్‌రెడ్డి, గణిత ఉపాధ్యాయుడు

మున్ముందు అన్ని పాఠశాలల్లో..



కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీలో భాగంగా ఇప్పటికే 5 వేల మంది విద్యార్థినులకు సెల్ఫ్ డిఫెన్స్‌పై పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాం. అలాగే ఈ ఏడాది రూ.10 లక్షలతో ప్రాజెక్ట్ రూపొందించి పది ఉన్నత పాఠశాలల్లో మ్యాథ్స్ ల్యాబ్ పరికరాలు అందిస్తున్నాం. వాటి వినియోగంపై నిపుణులతో ఉపాధ్యాయులకు శిక్షణ ఇప్పించాం. ఈ ఏడాది 6, 7, 8 తరగతుల విద్యార్థులకు మాత్రమే పరికరాలు ఉపయోగపడతాయి. వచ్చే ఏడాది 9, 10 తరగతులకు సైతం అందిస్తాం. అలాగే వచ్చే ఏడాది రెండు మండలాల్లోని మరిన్ని ప్రభుత్వ పాఠశాలల్లోనూ అమలు చేస్తాం.

– నళిని, సీఈఓ, శ్రీరామ చారిటబుల్ ట్రస్ట్

విశాఖకు పీయూ చెస్ జట్టు



చెస్ క్రీడాకారులతో పీయూ వీసీ జీఎన్ శ్రీనివాస్ తదితరులు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: విశాఖపట్టణంలోని గీతం యూనివర్సిటీలో ఈ నెల 5 నుంచి 8వ తేదీ వరకు జరిగే చెస్ పోటీల్లో పాల్గొనేందుకు పాలమూరు యూనివర్సిటీ జట్టు బుధవారం బయలుదేరింది. ఈ సందర్భంగా జట్టు సభ్యులకు పీయూ వీసీ జీఎన్ శ్రీనివాస్ ట్రాక్ సూట్, యూనిఫాంలు ఇచ్చి అభినందనలు తెలిపారు. పోటీల్లో చక్కటి ప్రతిభ కనబర్చి యూనివర్సిటీకి గుర్తింపు తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ చెన్నప్ప, ఓఎస్డీ మధుసూదన్‌రెడ్డి, కంట్రోలర్ రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

11 ఏళ్ల తర్వాత నిర్దోషిగా 'సుప్రీం' తీర్పు

2013లో హత్యకేసులో తిప్రాస్‌పల్లికి చెందిన భీమరాయుడు అరెస్టు

- హైకోర్టులో యావజ్జీవ శిక్ష
- ఆధారాలు సరిగా లేకపోవడంతో హైకోర్టు తీర్పును కొట్టివేసిన అత్యున్నత న్యాయస్థానం
- మహబూబ్‌నగర్ జైలు నుంచి విడుదల

నారాయణపేట: హత్య కేసులో 11 ఏళ్లుగా జైలుశిక్ష అనుభవిస్తున్న వ్యక్తి నిర్దోషిగా తేలింది. ఈ మేరకు మంగళవారం సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుతో బుధవారం ఆ వ్యక్తికి జైలు నుంచి విముక్తి లభించింది. వివరాల్లోకి వెళ్తే.. నారాయణపేట జిల్లా ఊట్కూర్ మండలం తిప్రాస్‌పల్లికి చెందిన భీమరాయుడు 2013 జనవరి 11న కుట్ర పూరితంగా సమీపంలోని రాయచూర్‌కు నాగేశ్ అనే వ్యక్తిని రప్పించి తన సోదరుడు, బావమరిదితో కలిసి హతమార్చినట్లు అభియోగం మోపారు. ఈ కేసులో మరో ఐదుగురు నిందితులు సహకరించినట్లు పోలీసులు ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్నారు. అయితే మహబూబ్‌నగర్ ట్రయల్ కోర్టులో ఏ–4 నుంచి ఏ–8 వరకు ఉన్న నిందితులను వదిలి.. ఏ–1, ఏ–2, ఏ–3లకు ఐపీసీ సెక్షన్ 302 కింద యావజ్జీవ శిక్ష, ఐపీసీ సెక్షన్ 364, 384, 201 కింద వివిధ శిక్షలను ఖరారు చేస్తూ 2016 అక్టోబర్ 13న తీర్పు ఇచ్చింది. దీంతో భీమరాయుడు హైకోర్టును ఆశ్రయించారు. అయితే ఏ–2, ఏ–3లను నిర్దోషులుగా విడుదల చేసి.. 2019 మార్చి 20న ఏ–1గా ఉన్న భీమరాయుడికి యావజ్జీవ శిక్ష విధిస్తూ హైకోర్టు తీర్పు ఇచ్చింది. దీంతో భీమరాయుడు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. అయితే కేసు పూర్వాపరాలు, దర్యాప్తు జరిగిన తీరు, సాక్ష్యాధారాలను పరిశీలించిన అత్యున్నత న్యాయస్థానం.. ఈ కేసులో పోలీసులు సేకరించిన ఆధారాలు సరిగ్గా లేవని, అతడిని నిర్దోషిగా విడుదల చేయాలని మంగళవారం తీర్పునిచ్చింది. సుప్రీం తీర్పు మేరకు భీమరాయుడిని బుధవారం సాయంత్రం మహబూబ్‌నగర్ జిల్లా జైలు నుంచి విడుదల చేశారు. అతడు ఇది వరకు జిల్లా జైలు ఆధ్వర్యంలో నిర్వహించే పెట్రోల్ బంకులో పనిచేశారు. ఆయనకు పారితోషికంగా నెలకు రూ.9 వేల నుంచి రూ.12 వేల వరకు వేతనం పొందేవారు. 11 ఏళ్ల తర్వాత తమ కుమారుడు ఇంటికి వస్తున్నందున తమకు సంతోషంగా ఉందని తండ్రి బాల్‌రాం పేర్కొన్నారు.

రైతుల కష్టం రోడ్డుపాలు



రహదారిపై పడిన బియ్యం బస్తాలు

అడ్డాకుల: రైస్‌మిల్లులో వడ్లను మరాడించగా వచ్చిన బియ్యాన్ని రైతులు ట్రాక్టర్‌లో ఇంటికి తీసుకెళ్తుండగా 44వ నంబర్ జాతీయ రహదారిపై ప్రమాదం చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో ఇద్దరు రైతులకు గాయాలయ్యాయి. బాధితుల వివరాల ప్రకారం.. వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం గట్లఖానాపురం గ్రామానికి చెందిన బోయ శ్రీను, గొల్ల బండలయ్య మంగళవారం ట్రాక్టర్‌లో వడ్లను అడ్డాకుల సమీపంలోని రైస్‌మిల్లుకు తీసుకువచ్చారు. అక్కడి నుంచి బియ్యం బస్తాలతో ట్రాక్టర్‌లో తిరిగి వెళ్తుండగా.. అడ్డాకుల సమీపంలో గుర్తు తెలియని వాహనం వెనక నుంచి ట్రాక్టర్‌ను ఢీకొట్టింది. దీంతో ట్రాక్టర్ బోల్తాపడగా.. అందులో ఉన్న బియ్యం బస్తాలు రోడ్డుపై పడి నేలపాలయ్యాయి. ట్రాక్టర్‌పై ఉన్న డ్రైవర్ బోయ శ్రీను తలకు తీవ్ర గాయాలై రక్తస్రావమైంది. మరో రైతు గొల్ల బండలయ్య స్వల్ప గాయాలతో బయటపడ్డారు. స్థానికులు, పోలీసులు క్షతగాత్రులను అంబులెన్స్‌లో వనపర్తి జిల్లా ఆస్పత్రికి తరలించారు. గట్లఖానాపురం మాజీ సర్పంచ్ కోట్ల వెంకటేష్ కొంత మంది యువకులతో కలిసి వచ్చి ఘటనా స్థలంలో పడిపోయిన బియ్యం సంచులను మరో వాహనంలో గ్రామానికి తీసుకెళ్లారు. ప్రమాదానికి కారణమైన వాహనం కోసం పోలీసులు గాలిస్తున్నారు.

భారీగా సీహెచ్ పట్టివేత

కేటీదొడ్డి: మండలంలో ఎక్సైజ్ పోలీసులు నిర్వహించిన మెరుపు దాడుల్లో భారీగా సీహెచ్ పట్టుకున్నట్లు తెలిసింది. మంగళవారం రాత్రి ఎక్సైజ్ పోలీసులు రెండు కేజీల సీహెచ్ మాత్రమే పట్టుబడిందని కేసు నమోదు చేసిన విషయం విదితమే. అయితే పెద్ద మొత్తంలో సీహెచ్‌ను గుర్తించిన ఎక్సైజ్ పోలీసులు.. తక్కువ మొత్తంలో స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించడం చర్చనీయాంశంగా మారింది. వివరాల్లోకి వెళ్తే.. నందిన్నె గ్రామంలోని సీహెచ్ అక్రమంగా నిల్వ చేసుకుని కల్లు తయారీకి వినియోగిస్తున్నారు. సమాచారం తెలుసుకున్న ఎక్సైజ్ పోలీసులు మెరుపు దాడులు చేపట్టారు. ఇంట్లో నిల్వ ఉంచిన సీహెచ్ (క్లోరల్ హైడ్రేట్)ను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అయితే నిందితుడి ఇంట్లో 50 కేజీల సీహెచ్‌ను గుర్తించారని తెలిసింది. ఈ కేసు నుంచి బయటపడేందుకు తీవ్ర ఒత్తిడి తీసుకురావడంతో అధికారులు తప్పని పరిస్థితుల్లో కేసు నమోదు చేశారని ఆరోపణలు వస్తున్నాయి. సీహెచ్, గంజాయి, డ్రగ్స్ వంటి మాదకద్రవ్యాల వినియోగాన్ని నియంత్రించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుంటే.. స్థానిక నాయకులు, పైరవీకారులు మాత్రం మాదకద్రవ్యాలు సరఫరా చేసే వారిని ప్రోత్సహిస్తున్నారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ కేసులలో పట్టుబడిన వారిని రక్షించేందుకు కేవలం రెండు కేజీల సీహెచ్ లభించినట్లు చూయించారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఈ విషయంపై ఎక్సైజ్ సీఐ గణపతిరెడ్డిని 'సాక్షి' వివరణ కోరగా.. సీహెచ్ ఉన్నట్లు సమాచారం మేరకు దాడులు చేపట్టి, రెండు కిలోల నిషేధిత మత్తు పదార్థాలు, బెల్లం స్వాధీనం చేసుకున్నారని తెలిపారు. సదరు వ్యక్తిపై కేసు నమోదు చేశామన్నారు. తమ శాఖపై చేస్తున్న ఆరోపణల్లో వాస్తవం లేదన్నారు. ఎవరైనా ఆధారాలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని.. వాటి ఆధారంగా చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.

దేశానికి శ్రీరామరక్ష.. కాంగ్రెస్ పార్టీ



మార్కెట్ కమిటీ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న మనీలా సంజీవ్ యాదవ్, చిత్రంలో మంత్రి జూపల్లి కృష్ణారావు

- రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటకశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు
- అట్టహాసంగా కల్వకుర్తి మార్కెట్ పాలకవర్గం ప్రమాణ స్వీకారం

కల్వకుర్తిరూరల్: కాంగ్రెస్ పార్టీ దేశానికి శ్రీరామరక్ష అని రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. బుధవారం కల్వకుర్తి వ్యవసాయ మార్కెట్ యార్డులో నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకారోత్సవం అట్టహాసంగా జరిగింది. కార్యక్రమానికి మంత్రితో పాటు ఎమ్మెల్యేలు కసిరెడ్డి నారాయణరెడ్డి, కూచుకుళ్ల రాజేష్‌రెడ్డి హాజరయ్యారు. నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకారం అనంతరం మంత్రి, ఎమ్మెల్యేల సమక్షంలో మార్కెట్ కమిటీ చైర్మన్‌గా మనీలా సంజీవ్ యాదవ్, వైస్ చైర్మన్‌గా పండిత్‌రావు బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ.. 70 ఏళ్ల తర్వాత పాలమూరుకు చెందిన రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టారన్నారు. పాలమూరు సమగ్రాభివృద్ధికి పక్కా ప్రణాళికలతో ముందుకెళ్తున్నట్లు చెప్పారు. ప్రతి సంవత్సరం రూ. 20 వేల కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టడంతో పాటు పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేస్తామన్నారు. గత పాలకులు ధనిక రాష్ట్రాన్ని రూ. 7లక్షల కోట్ల అప్పులకుప్పగా మార్చారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక అప్పులకు వడ్డీగా రూ. 70 వేల కోట్లు కట్టినట్లు చెప్పారు. కేసీఆర్ అబద్ధాలతో పదేళ్ల పాటు ప్రజలను భ్రమలో ఉంచారని అన్నారు. పాలమూరు – రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి నీటి వాటా కేటాయించని వారు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శించడం విడ్డూరంగా ఉందన్నారు. మార్కెట్ కమిటీ చైర్మన్, వైస్‌చైర్మన్, డైరెక్టర్లు అంకితభావంతో పనిచేసి, తమ పదవులకు వన్నె తేవాలని మంత్రి సూచించారు. కల్వకుర్తి నుంచి ఇతర మార్కెట్లకు వెళ్లిన ఆదాయాన్ని వెనక్కి వచ్చేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

- ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి మాట్లాడుతూ.. కల్వకుర్తి ఎత్తిపోతల పథకంతో చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందిస్తామన్నారు. నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో రహదారుల నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం రూ. 280 కోట్లు మంజూరు చేసిందన్నారు. రాబోయే రోజుల్లో నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సభ్యుడు బాలాజీ సింగ్, మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం, పీఏసీఎస్ చైర్మన్ జనార్దన్‌రెడ్డి, మాజీ మంత్రి చిత్తరంజన్ దాసు, మాజీ సర్పంచ్ భూపతిరెడ్డి, ఆనంద్‌కుమార్, రామకృష్ణ, విజయ్ కుమార్‌రెడ్డి, అశోక్‌రెడ్డి బాలాజీ సింగ్, లింగారెడ్డి, రామకృష్ణ పాల్గొన్నారు.

మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలి

- శ్రీశైలం జలాశయం సేఫ్టీ అధికారులు



మత్స్యకారులకు పంప్‌మోడ్‌పై అవగాహన కల్పిస్తున్న సేఫ్టీ డీఈ

దోమలపెంట: శ్రీశైలం ఎడమగట్టు భూగర్భ కేంద్రంలో పంప్‌మోడ్ (రివర్స్ పంపింగ్) పద్ధతిలో సాగర్ జలాశయం నుంచి శ్రీశైలం జలాశయంలోకి నీటిని ఎత్తిపోసే సమయంలో మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలని కేంద్రం సేఫ్టీ డీఈ శ్రీకుమార్‌గౌడ్, ఏడీఈ.రాము, స్టేషన్ ఫైర్ ఆఫీసర్ మల్లికార్జున అన్నారు. బుధవారం మత్స్యకారులకు ఈ విషయంపై అవగాహన కల్పించారు. ప్రధానంగా ఈ సమయంలో భూగర్భ కేంద్రం ఎగ్జిట్ ప్రాంతంలో చేపలు వేటాడటం, పుట్టీల్లో తిరగడం ప్రమాదకరమన్నారు. శ్రీశైలం ఆనకట్ట దిగువన ఉన్న నీటిని ఆ సమయంలో అత్యంత శక్తివంతంగా కేంద్రం ఎగ్జిట్ సొరంగం నుంచి నీటిని శ్రీశైలం జలాశయంలోకి తరలిస్తారని అన్నారు. పంప్‌మోడ్ జరిగేటప్పుడు ఈ ప్రాంతంలో చేపలు వేటాడకుండా ఉండాలని మత్స్యకారుల ప్రతినిధి సుబ్బరాయుడుకు తగు సూచనలు చేశారు.

పెరిగిన ఉల్లి ధర



దేవరకద్ర మార్కెట్‌లో ఉల్లిని కొంటున్న వినియోగదారులు

- గరిష్టంగా రూ.4750
- కనిష్టంగా రూ. 3500

దేవరకద్ర: స్థానిక మార్కెట్ యార్డులో బుధవారం జరిగిన ఉల్లిపాయల వేలంలో ధరలు గత వారం కంటే మరింత పెరిగాయి. వానాకాలం పంట కింద ఉల్లిని తక్కువ మొత్తంలో సాగు చేయడంతో దిగుబడులు తక్కువగా వస్తున్నాయి. దీంతో మార్కెట్ డిమాండ్‌కు తగ్గట్లు ఉల్లి అమ్మకానికి రాక పోవడంతో ధరలు పెరుగుతున్నాయి. ప్రస్తుతం మార్కెట్‌కు వస్తున్న ఉల్లి ఎర్రగా పచ్చిగా ఉన్నప్పటికీ ధరలు మాత్రం తగ్గడం లేదు. నిల్వ చేసిన పాత ఉల్లికి ఇంకా డిమాండ్ ఎక్కువగా ఉంది. కొందరు రైతులు నాణ్యమైన పాత ఉల్లిని నేరుగా అమ్ముకుని పోయారు. రూ.5వేలపైనే ధరలు పలికాయి. అయితే అధికారికంగా మార్కెట్లో నమోదు కాలేదు.

జోరుగా వేలం పాటలు

దేవరకద్ర మార్కెట్‌లో ఉల్లిపాయల వేలం జోరుగా సాగింది. స్థానిక వ్యాపారులతో పాటు బయట నుంచి వచ్చిన వ్యాపారులు పోటీపడి ఉల్లిని కొనుగోలు చేశారు. మొదటి రకం ఉల్లి క్వింటాల్ ధర గరిష్టంగా రూ. 4750, కనిష్ఠంగా రూ. 3500 ల వరకు ధరలు పలికాయి. గత వారం గరిష్ఠంగా ఉల్లి ధర రూ. 4550 ఉండగా రూ. 200వరకు పెరిగింది. కనిష్ఠంగా రూ. 2600 ల వరకు ఉండగా ప్రస్తుతం 900 వరకు ధర పెరిగింది..

45 కేజీల బస్తా రూ.2400

మార్కెట్ నిబంధనల ప్రకారం 45 కేజీల ఉల్లి బస్తా ధర గరిష్ఠంగా రూ. 2400 కు విక్రయించగా కనిష్ఠంగా రూ. 1800కు అమ్మకాలు సాగించారు. మధ్యస్థంగా రూ. 2100కు బస్తాగా విక్రయించారు. ఉల్లి తక్కువ మొత్తంలో రావడం వల్ల బయటి వ్యాపారులు కొనుగోలు చేసి ఉల్లిని వాహనాల్లో తరలించారు. చిరు వ్యాపారులు బస్తాలుగా కొనుగోలు చేశారు. బుధవారం దేవరకద్ర సంతలో కిలో ఉల్లి రూ. 60కు విక్రయించారు.

సమస్యలు సత్వరమే పరిష్కరించాలి

- ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు రాజసింహుడు



మాట్లాడుతున్న రాజసింహుడు

స్టేషన్ మహబూబ్‌నగర్: ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలను సత్వరమే పరిష్కరించాలని ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల జిల్లా అధ్యక్షుడు రాజసింహుడు డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని పారిశ్రామిక వాడలో బుధవారం నిర్వహించిన ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. 60, 70ఏళ్ల పైబడిన తాము వివిధ వ్యాధులతో బాధపడుతున్నామని అన్నారు. నెల రోజులుగా జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ క్లినిక్‌లో పూర్తిస్థాయిలో డాక్టర్, ఫార్మాసిస్టులు లేరని, మందులు రావడం ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రిటైర్డ్ ఉద్యోగులకు బకాయిలు చెల్లించడం లేదని, కారుణ్య నియామకాలు చేపట్టకుండా కాలయాపన చేస్తున్నారన్నారు. సమస్యలు వెంటనే పరిష్కరించాలని, లేకపోతే ఆందోళనలు చేపడుతామని ఆయన హెచ్చరించారు. నాయకులు జీబీపాల్, భగవంతు, నారాయణ, ఉమేష్‌కుమార్, నాగాంజనేయులు, రవీందర్‌రెడ్డి, రాములు, లలితమ్మ, భీమమ్మ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి అవసరాల కోసం 20 క్యూసెక్కులు

మదనాపురం: రామన్‌పాడు జలాశయంలో బుధవారం సాయంత్రం నాటికి నీటిమట్టం 1,020 అడుగులకు వచ్చి చేరింది. జూరాల ఎడమ కాల్వ ద్వారా 390 క్యూసెక్కులు ఇన్‌ఫ్లో ఉండగా.. సమాంతర కాల్వ ద్వారా వచ్చే నీటిని నిలిపివేశారు. ఎన్టీఆర్ కాల్వ ద్వారా 507 క్యూసెక్కులు కుడి, ఎడమ కాల్వ ద్వారా 45 క్యూసెక్కులు తాగునీటి అవసరాల కోసం 20 క్యూసెక్కుల నీటిని నియోగిస్తున్నామని ఏఈ వరప్రసాద్ తెలిపారు.